మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## గ్రంథాలయాలను రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతా

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

**సిద్దిపేట రూరల్, మే 13, ప్రభాతవార్త :** జిల్లాలోని గ్రంథాలయాలను రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగులు గ్రంథాలయాలకు వచ్చి మంచిగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలన్నారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు, నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలను అంతర్గత సౌకర్యాలను అందుబాటులో ఉండడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే సమస్యలను జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లిస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో నాయకులు జిల్లా ఆర్టీఏ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్ర వర్మ, పార్టీ నాయకులు దాసరి రాజు, వంగరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష

**చౌటకూరు, మే 13, ప్రభాతవార్త:** జోగిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. 119 మంది బాలురు, 121 మంది బాలికలు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 113 మంది బాలురు, 111 మంది బాలికలు హాజరయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద జోగిపేట సిఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.



కళాశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



గడిపెద్దాపూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతిమాసింగ్

## జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### -మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**అల్లాదుర్గం, మే 13, ప్రభాతవార్త:** జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో బుధవారం జనగణనను తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో 1881 సంవత్సరం నుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి సెన్సెస్ నిర్వహిచడం జరుగుతోందని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికి ప్రభుత్వ ఇప్పుడు 16వ జనగణన చేపడుతోందన్నారు. సర్వేలకు భిన్నంగా సెన్సెస్ చట్టబద్దంగా నిరర్వహించబడే ప్రక్రియ అని, అందుకు ప్రతి ఒక్కరు తమ వివరాలను ఇవ్వాలని, తమ సమాచారరం దాచి పెట్టకూడదని స్పష్టం చేశారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తామని, మే 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు మొదటి దశగా లిస్టింగ్ చేపట్టే ఇండ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు స్వీకరిస్తామన్నారు. నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, తరచుగా వినియోగించే ఆహార ధాన్యాలు లాంటి అంశాలు నమోదు చేస్తారని, 13 ప్రశ్నల ద్వారా గృహ వివరాలు సేకరించి డిజిటల్‌గా భద్రపరుస్తామన్నామని కలెక్టర్ ప్రతిమాసింగ్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఏపిఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట అర్బన్/నంగునూర్, మే 13, ప్రభాతవార్త :** ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, నంగునూర్ మండలం ముండ్రాయి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని ఎఎంసిలలో మాత్రమే మక్కల కొనుగోలు వేగంగా కొనసాగుతుందన్నారు. తేమశాతం వచ్చి లిఫ్ట్ చేయడానికి తయారుగా ఉన్న ధాన్యాన్ని లారీలు వచ్చేవరకు ఆగకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్ ఇతరత్ర వాహనాలలో నింపి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలలో మౌలిక వసతులు టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్‌కవర్లు, సుతిల్ దారాలు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని సెంటర్‌లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మిల్లులో దిగుమతిలో జాప్యం జరగకుండా అధికారులు పని చేయాలని ఆదేశించారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

### సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సంగీత



వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ సంగీత

**హత్నూర మే 13 ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డిఎల్ సంగీత బుధవారం హత్నూర మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను, రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. మండలంలోని చందాపూర్, దేవులపల్లి, హత్నూర, సిరిపురం, దౌల్తాబాద్, బోర్పట్ల గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలతో పాటు రైస్ మిల్లులను సందర్శించి రికార్డులను పరిశీలించారు. వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తూకం చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆమె ఆదేశించారు. అదనపు కలెక్టర్ పిఎల్ సంగీత వెంట, హత్నూర తహసీల్దార్ ఫర్వీన్ షేక్, ఆయాల ఆయా గ్రామాల జిపిఓలు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీట్ ప్రశ్న పత్రం లీక్

### బిఆర్‌ఎస్‌వి జిల్లా మాజీ అధ్యక్షుడు మెరుగు మహేష్

**సిద్దిపేట అర్బన్, మే 13, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా నీట్ ప్రశ్నపత్రం లీకైందని బిఆర్‌ఎస్‌వి జిల్లా మాజీ అధ్యక్షుడు మెరుగు మహేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే నీట్ ప్రశ్నాపత్రం లీకై పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి వచ్చిదంటే యావత్ భారత విద్యార్థి లోకం గమనించాలన్నారు. పగలు రాత్రి కష్టపడి చదివిన ఎంతో మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతుందని విమర్శించారు. పకడ్బంధీగా పరీక్షలు నిర్వహించడం చేతకానీ కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వలనే మరోసారి పేపర్ లీకైందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ యేడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులను కేంద్ర సర్కార్ తీవ్ర మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తుకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా అందరినీ పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బంధీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధిలో భాగస్వాములు కండి

### నూతన కో ఆప్షన్ సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్... హుస్నాబాద్ మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**హుస్నాబాద్ రూరల్, మే 13, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనరల్ కేటగిరీలో పున్న లావణ్య, భూక్యా సరోజన కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కాగా, మైనార్టీ విభాగంలో మహమ్మద్ హసన్‌లాల్ కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. మరో కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఎన్నికైన పున్న లావణ్య, భూక్యా సరోజన, మహమ్మద్ హసన్‌లతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో కొత్తగా కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉందని, ఏకాభిప్రాయానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు హుస్నాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.



నూతన కోఆప్షన్ సభ్యులతో మంత్రి పొన్నం ప్రభాకర్

**విద్యకు ప్రథమ ప్రాధాన్యత...**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో హుస్నాబాద్ వైశ్య భవన్‌లో సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లతో ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి అభినందించి సత్కరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల రూపురేఖలు మారాలంటే సర్పంచ్‌లు క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపు, మౌలిక సదుపాయాల కల్పనకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రాప్‌ఔట్‌లు జరగకుండా చూడాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలియజేయాలన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చానని, విద్యకు, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో 31 మండలాలకు 29 మోడల్ స్కూల్స్, కస్తూర్బా పాఠశాలలు తీసుకువచ్చినట్లు తెలిపారు. కోహెడ సమీపంలోని తంగలపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. అదేవిధంగా 250 పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఎలకతుర్తిలో బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ ఏర్పాటు కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈవోలు, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల సర్పంచ్‌లు, పధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### కొత్త చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

**హుస్నాబాద్ టౌన్, మే 13, ప్రభాతవార్త :**

పట్టణంలోని కొత్త చెరువు అభివృద్ధి పనులను పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు కట్ట సుందరీకరణ, తూము అభివృద్ధి పనులను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు కట్ట వెడల్పు పనులు పూర్తయిన అనంతరం దశల వారీగా సీసీ రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కట్టపై రహదారి అభివృద్ధి జరిగితే ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని పేర్కొన్నారు. అలాగే కొత్త చెరువు కట్ట లింక్ రోడ్డును సిద్దిపేట జాతీయ రహదారి లింక్ నుంచి హుస్నాబాద్-కరీంనగర్ ఔటర్ రోడ్డుగా ఉపయోగించే అవకాశాలు ఉన్నాయని మంత్రి సూచించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు భవిష్యత్తులో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు.

# ధాన్యం తూకం వేయాలంటూ రైతుల ధర్నా

**చౌటకూరు, మే 13, ప్రభాతవార్త**

ధాన్యం నిల్వలను తూకం వేయాలంటూ మండల పరిధిలోని కోర్పోలు అన్నదాతలు ఆగ్రహిస్తూ బుధవారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యానికి తూకం వేయడంలో డిసిసిబి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. హమాలీలను పూర్తి స్థాయిలో నియమించకుండా కేంద్రాన్ని కొనసాగిస్తూ రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో రెండు కొనుగోలు కేంద్రాలు అవసరం ఉండగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో సమస్య తీవ్ర రూపం దాలుస్తోందని విచారం వ్యక్తం చేశారు. ధాన్యం కోసం నెలరోజులు గడుస్తున్నా తూకం వేయకుండా టోకెన్లు జారీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 మంది హమాలీలతో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని, గ్రామంలో వరి పంట సాగు అధికంగా ఉన్నందున మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు అదనంగా కూలీలను సమకూర్చి తూకం చేయిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అటుగా వెళుతున్న అదనపు కలెక్టర్ పాండు రాస్తారోకో చేస్తున్న రైతుల వద్దకు చేరుకుని విచారింగా తమ గ్రామంలో 28వేల క్వింటాళ్ల వరకు ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ఒక కేంద్రంలో సమస్య పరిష్కారం కావడం లేదని, అందుకు అదనంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, డీసీఎంఎస్ ఇన్‌చార్జి వంశీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకటి రెండు రోజుల్లో హమాలీలు వస్తారని అధికారులు బుకాయిస్తున్నారే తప్పితే హమాలీలను ఏర్పాటు చేయడంలో సఫలీకృతులు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో కూలీల, లారీల సమస్యలను తీరుస్తామని పాండు రైతులకు భరోసా కల్పించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీసీఎంఎస్ ఇంచార్జి వంశీపై అదనపు కలెక్టర్ అక్షింతలు చల్లారు. కొనుగోలు కేంద్రం ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా కేవలం ఇంత వరకు 5 లారీల ధాన్యంను మాత్రమే రైస్ మిల్లులకు పంపించారని రైతులు గగ్గోలు చేశారు.




జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కోర్పోలు రైతులు

# రామాయంపేటలో రూ.15 లక్షల నిధుల దుర్వినియోగం..?

### అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య డిమాండ్

### రికార్డుల తారుమారుపై అనుమానం.. మేనేజర్, రికార్డు గదులకు తాళాలు

**రామాయంపేట, మే 13, ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగం వ్యవహారం కలకలం రేపుతోంది. ఎన్నికల ఖర్చుల పేరుతో జనరల్ ఫండ్ నుంచి డ్రా చేసిన సుమారు రూ.15 లక్షల నిధులకు సంబంధించి సరైన రసీదులు లేకపోవడం, ఖర్చుల వివరాలు అందుబాటులో లేకపోవడంతో పాలకవర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య మాట్లాడుతూ, మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా నిధులను బాధ్యతారాహిత్యంగా వినియోగించి, లెక్కలు చూపకుండా దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం రూ. 15 లక్షలు కేటాయించినప్పటికీ, అదనంగా మరో 15 లక్షల రూపాయలు జనరల్ ఫండ్ నుంచి డ్రా చేసి లెక్కలు చెప్పకపోవడం ఏంటని ప్రశ్నించారు. పాలకవర్గం ఏర్పాటై మూడు నెలలు కావస్తుందని, మూడు సమావేశాలు నిర్వహించామని, ఏ సమావేశంలోనూ పాలకవర్గం దృష్టికి తేలేదని అన్నారు. బిల్స్ ఇవ్వండని, లెక్కలు చెప్పాలని అధికారులను అడిగితే మీకు చెప్పాల్సిన అవసరం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ప్రజలచే ఎన్నుకోబడిన తాము ప్రజల సొమ్మును ఖర్చుచేసినప్పుడు వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

ఈ నేపథ్యంలో రికార్డులు తారుమారు అయ్యే అవకాశం ఉందనే అనుమానంతో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మేనేజర్ గది, రికార్డు గదులకు తాళాలు వేశారు. జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలోనే తాళాలు తీసి సంబంధిత రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య

మున్సిపాలిటీలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాలకవర్గం డిమాండ్ చేసింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ముఖ్యంగా తమకు ఇన్‌చార్జి కమిషనర్ కాకుండా పర్మినెంట్ కమిషనర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడి కమిషనర్ గణేష్‌రెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇక్కడి మేనేజర్ రఘువరన్, అకౌంటెంట్ సంతోషిని, జూనియర్ అకౌంటెంట్ భాస్కర్ వారి విధులను నిర్వహించకుండా, కమిషనర్ అందుబాటులో లేడంటూ ప్రజలకు అందాల్సిన సేవలను సక్రమంగా అందించక కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. కనీసం ఇళ్ల పేరు మార్పిడికోసం ఒక వ్యక్తి రెండు నెలలుగా కార్యాలయానికి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ విషయంలో అధికారులను అడిగినా సరైన సమాధానం చెప్పటం లేదని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నవనీత గణేష్, కౌన్సిలర్‌లు గజవాడ నాగరాజు, కొక్కు ప్రవీణ్, రవినాయక్, భైరం స్వప్న కుమార్, పుట్టి సందీప్, దేవుని రంజిత్, దాకి శ్యామల స్వామి, కోఆప్షన్ సభ్యులు దేమె యాదగిరి, ఎండి గౌస్‌లు పాల్గొన్నారు. కాగా అధికారులకు, పాలకవర్గానికి సమన్వయం లోపం ఉన్నట్లుగా బహిరంగా కనిపిస్తున్న ఈ ఘటన స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



వివరాలు తెలుపుతున్న పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్

## అనుమానంతో భార్యపై భర్త దాడి

### -కాలు, చేయి నరికివేత... రిమాండ్‌కు నిందితుడి తరలింపు

**చౌటకూరు, మే 13, ప్రభాతవార్త:** భార్యపై భర్త అనుమానం పెనుబూతంగా మారి ఇద్దరి మద్య మనస్పర్ధలు ఏర్పడి దాడి చేసే స్థాయికి చేరుకుంది. ఇందుకు సంబంధించి పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్ కథనం ప్రకారం... మండల పరిధిలోని గంగోజిపేట గ్రామానికి చెందిన కుమ్మరి వీరమణి, దుర్గయ్య భార్యభర్తలు, దుర్గయ్య శివంపేట బీరు పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త తరుచూ గొడవపడుతూ ఉంటాడన్నారు. ఇద్దరు కుమారులతో కలిసి భార్య సంగారెడ్డిలోని కొత్లాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటోందన్నారు. గ్రామంలో డ్వాక్రా గ్రూపు డబ్బులు కట్టేందుకు భార్య వీరమణి ఈ నెల 11న గ్రామానికి చేరుకోగా ఈ ఒక్క రోజు ఇక్కడే ఉండి తెల్లారి సంగారెడ్డికి పోవాలని భర్త చెప్పడంతో భర్తపై నమ్మకంలో భార్య వీరమణి భర్తతో కలిసి ఇంట్లో నిద్రిస్తోంది. భార్యపై రగిలిపోతున్న భర్త ముందస్తు పథకం ప్రకారం రాత్రికి గొడ్డలితో భార్య కుడికాలు నరికి వేరుచేసి కుడి చేతిపై సైతం గొడ్డలితో నరికాడన్నారు. దీంతో భార్య గట్టిగా అరవడంతో ఇరుగుపొరుగు వారు రాగా భర్త దుర్గయ్య అక్కడిని నుంచి పారిపోయాడని చెప్పారు. ఈ విషయాన్ని పోలీసులకు, వీరమణి పిల్లలకు సమాచారం అందించగా వీరమణిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. భార్యపై దాడిచేసిన గొడ్డలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దుర్గయ్యను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విశ్వజన్ వివరించారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



వివరాలు తెలుపుతున్న ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్

**ఝరాసంగం, మే 13, ప్రభాతవార్త:** కిందిదొడ్డి అశోక్‌పై హత్యాయత్నం చేసిన కిందిదొడ్డి శ్రీనివాస్‌ను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కిందిదొడ్డి అశోక్(37) అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కిందిదొడ్డి శ్రీనివాస్ (38)లు పాలివారు. ఇద్దరి మధ్య ఉన్న పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 11వ తేదీన కిందిదొడ్డి శ్రీనివాస్ రాత్రి 10 గంటల ప్రాంతంలో కిందిదొడ్డి అశోక్‌పై గొడ్డలితో దాడి చేయగా భుజానికి గాయం అయింది. అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ వివరించారు.

## మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్



అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పరును సీజ్ చేసిన దృశ్యం

**చౌటకూరు, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాడ్‌దన్‌పల్లి టోల్ ప్లాజా వద్ద ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం, నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. జోగిపేట సిఐ అనిల్ కుమార్ కథనం ప్రకారం... వాల్టా నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా మట్టి రవాణా కొనసాగుతున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెంచామని, తాడ్‌దాన్‌పల్లి టోల్ ప్లాజా వద్ద రెండు టిప్పర్లను ఆపి తనిఖీ చేయగా ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలను సీజ్ చేశామన్నారు. అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు.

## పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన నిందితుడి రిమాండ్

**అక్కన్నపేట, మే 13, ప్రభాతవార్త :** ప్రేమ పేరుతో యువతిని నమ్మించి పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా లొంగదీసుకొని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రశాంత్ బుధవారం తెలిపారు. ఎస్ఐ ప్రశాంత్ కథనం ప్రకారం... జనగామ జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన ఉస్తేం ప్రవీణ్(22) అక్కన్నపేట మండల పరిధిలోని బొడిగెపల్లికి చెందిన యువతితో ప్రేమ పేరుతో పరిచయం పెంచుకున్నట్లు తెలిపారు. అనంతరం అమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకున్నట్లు చెప్పారు. ఈక్రమంలో పెళ్లి విషయం రాగానే నిందితుడు తప్పించుకొని బాధితురాలిని మోసం చేసినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రశాంత్ వివరించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రశాంత్

## ఆలిండియా క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన పోలీసు అధికారులు



పతకాలు సాధించిన కట్టా హరిప్రసాద్, మాధవి ఇతర పోలీసు అధికారులు.

**జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః**
ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో మే 8 నుండి 13 వరకు నిర్వహించిన 2వ ఆల్ ఇండియా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో పలువురు పోలీసు అధికారులు తమ ప్రతిభ కనబరిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఎసిపి కట్టా హరిప్రసాద్, హుజూరాబాద్ ఎసిపి వి. మాధవి బృందం రజత పతకం(సిల్వర్ మెడల్) సాధించారు. ఈ విభాగంలో ఇంటెలిజెన్స్ బ్యూరోకు చెందిన ఎన్‌జీ రతన్ కుమార్, బీసీ రాంబాయి బృందం స్వర్ణ పతకం గెలుచుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐజీపీ ఎ. రవి కృష్ణ, ఎస్పీ జి. స్వరూపరాణి బృందంతోపాటు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన అలోక్ కుమార్ శ్రీవాస్తవ, విజయ్ ధౌండియాల్ జంటలు కాంస్య పతకాలు సాధించాయి. ఈ పోటీల్లో పాల్గొన్న అధికారులు తమ ప్రతిభతో విశేషంగా ఆకట్టుకున్నారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు సాయం కళాశాలలో తెలుగు కోర్సులు

**నాంపల్లి, మే 13 ప్రభాతవార్త :** బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య (సాయం)కళాశాలలో వివిధ తెలుగు కోర్సు లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 1965లో ప్రారంభమైన ఈ కళాశాలలో తెలుగు భాషా సాహిత్యాల్లో పిడిసి (ప్రీ డిగ్రీ కోర్సు), బిఏ (లాంగ్వేజెస్), ఎంఏ (లాంగ్వేజెస్) కోర్సు లు నడుస్తున్నాయి, ఈ కోర్సు లు చదివినవారు తెలుగు పండితులుగా కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులుగా, అధికారులుగా, పాత్రికేయులుగా స్థిరపడ్డారు. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు రెండేళ్ల పిడిసి కోర్సు కు అర్హులు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనవారు బిఏ లాంగ్వేజెస్‌లో డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం (దోస్త్) ద్వారా ప్రవేశం పొందవచ్చు. తెలుగు ద్వితీయభాషగా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఎంఏ లాంగ్వెజెస్‌కు అర్హులు. పగటిపూట వివిధ ఉద్యోగాలు చేసుకుంటూ ఈ తెలుగు కోర్సు లు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నవారందరూ సాయంత్రం 5నుండి రాత్రి 9గంటల వరకు ఈ కళాశాలలో చేరి తరగతులకు హాజరు కావచ్చును. పూర్తి వివరాల కోసం 9441085114 / 9032812971 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించవచ్చునని కళాశాల కరస్పాండెంట్, సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య ప్రకటనలో తెలిపారు.

## కబుతర్‌ఖానా 15వ బూత్‌లో సర్ కొనసాగింపు..



ఓటర్ల జాబితాల సవరణ పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సున్నం రాజమోహన్

**అఫ్జల్‌గంజ్,మే 13 ప్రభాతవార్త:** ఓటుహక్కు ప్రతి ఒకరు భాధ్యతగా భావించి,అంతేకాకుండా ప్రత్యేకంగా ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమాన్ని పురానాపూల్ డివిజన్‌లోశ్రీకారం చుట్టారు. డివిజన్ పరిధిలోని 15వ బూత్ వద్ద ఎస్.ఐ.ఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)నిర్వహించారు.డివిజన్ మాజీ కార్పొరేటర్ సున్నంరాజమోహన్ పర్యవేక్షణలో మజ్లీస్ క్రియాశీలసభ్యులు అమ్జద్‌ఖాద్రి 15వ పోలింగ్ బూత్‌వద్ద ప్రత్యేక విస్తృత పునశ్చరణ(సర్)పనిని చేపట్టారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మజ్లీస్ అధినేత, పార్లమెంట్‌సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ,చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ సూచనల మేరకు పని చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మజ్లీస్ కార్యకర్త అంజాద్‌ఖాద్రి పాల్గొన్నారు

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన జగదీశ్వర్,ముజీబ్ హుస్సేనీ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన కుమారుడి వివాహ పత్రికను అందచేస్తున్న టిఎన్‌జిఓ కేంద్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ,ఈచిత్రంలో అధ్యక్షులు ఎం.జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

**గన్‌ఫౌండ్రి,మే13ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం,అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈసందర్బంగా తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిడాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీ కుమారుడు అసదుద్దీన్ వివాహం ఈనెల 15వ తేదిన జరగనున్న పెండ్లీ వేడుకకు ఆహ్వానించి పత్రికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందచేశారు.పెండ్లీ కుమారుడుఅసదుద్దీన్ కూడా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీస్సు లు తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పెండ్లిపత్రికను అందచేసినట్లు డాక్టర్ ముజీబ్‌హుస్సే నీ తెలిపారు.

## 17న మినీ మహానాడు విజయవంతం చేయాలి



మినీ మహానాడు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

**ముషీరాబాద్, మే 13 ప్రభాతవార్త:** ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ పార్లమెంట్ మినీ మహానాడుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నెల్లెల కిషోర్, శ్రీపతి సతీష్, పి.బాల్‌రాజ్‌గౌడ్, కాసుల సుదర్శన్‌రెడ్డి, తడక వినోద్, గుట్ట అనిల్ కురుమ, ఎం.శ్యాంసుందర్, పి.వంశీకృష్ణ తదితరులు బుధవారం టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మినీ మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తాను జడ్జి కావడానికి ఈ పాఠశాలే కారణం



రత్నకుమారిని సత్కరిస్తున్న కరస్పాండెంట్ , ప్రిన్సిపల్

**ముషీరాబాద్, మే 13 ప్రభాతవార్త:** కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో 2015-16 సంవత్సరాల్లో పదవ తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థిని వదినపల్లి రత్నకుమారి పాఠశాలకు బుధవారం నాడు విచ్చేసి తాను జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులై ప్రస్తుతం రామన్నపేట భువనగిరి యాదగిరి జిల్లా కోర్టులో విధులను నిర్వహిస్తున్నానని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు ధన్యావాదాలు తెలియజేశారు. తన ఎదుగుదలకు ఈ పాఠశాల ఎంతో ఉపయోగపడిందని, 10వ తరగతి వరకు ఇచ్చిన బేసిక్ స్టాండర్డ్స్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పి.స్వర్ణలత, ఉపాధ్యాయులు కృష్ణవేణి, మనీష్, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

## గోవధ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలి

### -భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ డిమాండ్





సమావేశంలో మాట్లాడుతున్న జస్‌రాజ్ శ్రీశ్రీమల్. చిత్రంలో మహేష్‌అగర్వాల్, జస్మత్‌పటేల్ తదితరులు

**సైఫాబాద్, మే 13 ప్రభాతవార్త:** గోవధ నిషేధ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని, గోవులు, ఎద్దులు, దూడల అక్రమ రవాణాను అరికట్టాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ డిమాండ్ చేసింది. గోవధ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వల్లనే ప్రతి ఏడాది వేలాది గోవులు, ఎద్దులు, దూడలు బలిఅవుతున్నాయని సంఘ్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జస్‌రాజ్‌శ్రీశ్రీమల్, మహేష్‌అగర్వాల్ మాట్లాడుతూ ఈ నెల 27న బక్రిద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణా పెద్ద ఎత్తు న జరుగుతున్నదని ఆరోపించారు. ఇప్పటికే వేలాది గోవులు పాతనగరానికి తరలించడం జరిగిందని, వాటిని రహస్య ప్రదేశాల్లో దాచిపెట్టారని, చెక్ పోస్టల వద్ద పోలీసులు ఉన్నప్పటికి పట్టించుకోవడం లేదని, డబ్బులకు అశపడి లారీలను వదిలివేస్తున్నారని ఆరోపించారు. గోవధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, డిజిపి, పశు సంవర్ధక శాఖ మంత్రి, తదితరులకు వినతి పత్రాలను సమర్పించామని, వారి నుంచి ఏలాంటి స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద భారీగా పోలీసుల బందోబస్తును నిర్వహించాలని, అక్రమ రవాణా దారులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ్ ప్రతినిధులు జస్మత్ పటేల్, రిదేశ్ జాగిర్దార్, ముఖేష్‌చౌహన్, న్యాయవాది జి.ఎల్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మహిళల నిరసన





అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

**సైఫాబాద్, మే 13 ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయిభగీరథ్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఆనేక మంది మహిళలు బుధవారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో వేదిక ప్రతినిధులు వి.సంధ్య, ఝాన్సీ, బి.జ్యోతి, అనురాధ తదితరులు మాట్లాడుతూ బాలిక తనపై భగీరథ్ అత్యాచారం చేశాడని, నాలుగు నెలలుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఫోక్సో చట్టం ప్రకారం తక్షణమే అతన్ని అరెస్టు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును తప్పుదారి పట్టించేందుకు, కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ప్రజా ప్రతినిధులు, పోలీస్ ఉన్నాతాధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. సిట్ పేరిట కాలయాపన చేయరాదని, భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యి ఆరురోజులు గడిచినా అరెస్టు చేయకపోవడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవిత, సావిత్రి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## పాతబస్తీలో విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు పాటుపడాలి : ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్



విద్యా వారోత్స వాలలో పాల్గొన్న బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

**చార్మినార్,మే 13 ప్రభాతవార్త :** విద్యార్దులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సి న గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని,పాతబస్తీలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు పాటు పడాలని బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ అన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం పాతబస్తీ జహనుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్‌లో జరిగిన విద్యా వారోత్స వాల కార్యక్రమానికి ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరూ చదువు కోవాలని,ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలకువచ్చి విద్యార్దులకు విద్యా బోధనలు చేయాలని తెలిపారు.బహదూర్‌పుర నియోజకవర్గంలోని ఇంద్రానగర్‌లో పాఠశాల,హైస్కూల్ భవనాన్ని నిర్మించనున్నామని ఆయన తెలియజేశారు.బహదూర్‌పుర జోన్ ఉప విద్యాధికారి ఆర్.సుమన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో మంచి ఫలితాలు తీసుకు రావటానికి అన్ని విధాల కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు హుస్సేనీ పాషా,బహదూర్‌పుర జోన్ రెండుఐఓఎస్ ఎస్.నరేందర్ యాదవ్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు,హైస్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిబిఎస్ఈలో వంద శాతం ఫలితాలు

**జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః**
సిబిఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన జస్మిత మోడపోతుల, దక్ష్ లునియాలు 88.4 శాతం మార్కులతో ప్రథమ స్థానం, అనన్య పటేల్ 87.4 శాతం మార్కులతో రెండో స్థానం, పీయూష్ అగర్వాల్, కనక్ 87.2 శాతం మార్కులతో మూడవ స్థానం సాధించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగంలో త్రిజల్ గుప్తా 100 మార్కులు సాధించారు. ఈ సందర్బంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఈ ఫలితాలు సాధించడానికి కారణమైన అధ్యాపక బృందాన్ని డైరక్టర్ ఎమ్. వరలక్ష్మి, ప్రిన్సిపల్ కాంచనవల్లి అభినందించారు. జూబ్లీ హిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ఎ. మురళి ముకుంద్, విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ (విద్యాశ్రమం)కు చెందిన విద్యార్థులు సైతం వంద శాతం ఫలితాలు సాధించారు. సహర్ష్ గోయాంక 95.6 శాతం మార్కులు, కామర్స్ విభాగంలో శ్రేష్ట 464 మార్కులు సాధించానట్లు పాఠశాల ప్రిన్సిపల్ అరుణశ్రీ తెలిపారు.

## యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్‌కు సత్కారం



రఘునాథ్‌యాదవ్‌ను సత్కరించిన బిసి ఐక్యసంఘం నేతలు

**శేరిలింగంపల్లి,మే 13 ప్రభాతవార్త**
శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్‌ను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించటంపై తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంఘాల నేతల ఆధ్వర్యంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.ఈ సందర్బంగా భేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సుధీర్ఘకాలం అంకితభావంతో పనిచేస్తున్న క్రమంలో పార్టీ అధిష్టానం గుర్తించి రఘునాథ్ యాదవ్‌కు సముచితమైన స్థానం కల్పించటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు అందెల కుమార్,హరికృష్ణచారి, శ్రీనివాస్ యాదవ్, శివయాదవ్,రమేశ్; బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు అర్‌కే సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలతో పట్టుబడ్డిన మేరీపై కేసు

**జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః** బోరబండలో బెల్టు షాపు నిర్వమిస్తున్న మరియా అలియాస్ మేరీపై బోరబండ ఠాణాలో కేసు నమోదైంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి బోరబండ బస్టాప్ వద్ద ఎస్సై కాశయ్య తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు హోండా యాక్టివాపై అనుమానస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించి వాహనం నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని వదిలి అక్కడి నుంచి పరారవ్వగా వాహనం వెనుక వైపు ఉన్న మహిళ వద్ద మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. ఆమెను విచారించగా మరియా అలియాస్ మేరిగా గుర్తించారు. మొత్తం 105 మద్యం సీసాలను ఆమె వద్ద స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలను జేఎస్ వైన్స్‌లో కొనుగోలు చేసినట్లు గుర్తించారు. పట్టుబడిన వాటి విలువ రూ. 13662 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నవ్వులు చిలికించిన హాస్యగుళికలు పేరిడీ పాటలు





హాస్య పేరిడీ పాటల ప్రదర్శనలో కళాకారులు

**రవీంద్రభారతి, మే 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా రవీంద్ర భారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతిక మహోత్స వాలలో భాగంగా అత్యంత అద్భుతంగా ప్రదర్శించిన హాస్యగుళికలు, పేరిడీ పాటలు హాజరైన అశేష ప్రేక్షకుల ముఖాలపై నవ్వులు చిలికించి మనోరంజన కలిగించాయి. ఖమ్మం జిల్లా నుండి వచ్చిన మొగలి ఎంటర్‌టైన్మెంట్ కళాకారులు మొగిలి వెంకటేశ్వర్లు, బూరుగు సుధీర్, జిల్లేపల్లి రమేష్ తదితరులు హాస్య సంభాషణలు, వివిధ హాస్యాంశాల ప్రదర్శనలతోపాటు పలు పేరిడీ పాటలతో ఆవరణ వాతావరణాన్ని హాస్యజల్లులతో ముంచెత్తివేశారు. ఈ సందర్బంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆయా కళాకారులను ఘనంగా సత్కరించి, ఆసాంతం తన ఉత్తేజపూర్వక వ్యాఖ్యానం, మధ్యమధ్య తీన్మార్ పాటలతో ఉర్రూతలూగిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారధి ప్రముఖ కళాకారుడు విద్యానందచారిని ఎంతగానో అభినందించారు.

## అద్భుతం బ్రహ్మంగారి సమాధి ఘట్టం బుర్ర కథ



**చిక్కడపల్లి మే 13 ( ప్రభాతవార్త ) :** తెలుగు రాష్ట్రాల ప్రాచీన కళారూపమైన బుర్రకథను నేటి తరానికి అందించడంలో ఇలాంటి సప్తాహాలు ఎంతో దోహదపడతాయని తెలంగాణ బ్రాహ్మణా పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదిక లో గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో బ్రహ్మంగారి సమాధి ఘట్టం ను అద్భుతంగా బుర్రకథను వినిపించిన బి.జనార్దన్ ను సత్కరించి పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రాచీన జానపద కళారూపాలను కాపాడుకోవాల్సి న బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మరుగున పడిపోతున్న బుర్రకథ వంటి కళలకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఒకప్పుడు సామాజిక చైతన్యానికి, పురాణ గాథల ప్రచారానికి బుర్రకథ ప్రధాన మాధ్యమంగా ఉండేదని, నేటి సాంకేతిక యుగంలో కూడా దాని ప్రాముఖ్యత తగ్గలేదని ఆయన వివరించారు. గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సహకరించండి...

### సిఎంసి కమిషనర్ సృజనతో టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ బేటి



కమిషనర్ సృజనతో మాట్లాడుతున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాతవార్త:**
నియోజకవర్గ సమస్యల పరిష్కారార్థమై టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. హౌసింగ్ బోర్డ్ నుండి హఫీజ్‌పేట్ వెళ్లే రోడ్డును విస్తరించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, స్వాన్ లేక్ నాలా అసంపూర్తిగా ఉందని దాన్ని పూర్తి చేయాలని భవన విజయం పటిల్ గ్రౌండ్ మెయింటెనెన్స్‌ను ప్రైవేట్ వ్యక్తుల నుంచి తీసుకొని జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలోని నిర్వహణ చేయాలని బండి రమేష్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కెపిహెచ్‌బి కాలనీ పరిధిలోని ఎమినిటీస్ కోసం వదిలిన స్థలాలు అన్నిటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ కెపిహెచ్‌బి కాలనీలో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్‌కు కమ్యూనిటీ హాల్‌ను కేటాయించాలని రమేష్ వినతిపత్రంలో పేర్కొన్నారు. అల్లాపూర్ స్మశాన వాటిక మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తిచేసి జూన్ 2న ప్రారంభించాలని సిఎంసి కమిషనర్‌కు రమేష్ సూచించారు. ఆయా పనులు విషయమై ఆమె సానుకూలంగా స్పందించినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, గాలి బాలాజీ, గొట్టుముక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఖానామెట్‌లోని అసైన్డ్,యుఎల్‌సీ భూముల అక్రమాలపై విచారణ జరపాలి : గ్రామస్తుల డిమాండ్



శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**శేరిలింగంపల్లి,మే 13 ప్రభాతవార్త**
శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ గ్రామంలో ప్రభుత్వ భూముల అక్రమ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు శేరిలింగంపల్లి మండల తహశిల్దార్ మహిపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఖానామెట్ గ్రామస్థులు సయ్యద్ షకీల్,సయ్యద్ అజమ్,సయ్యద్ తోఫిఖ్, రామకృష్ణలు మాట్లాడుతూ.. 1961 సంవత్సరంలో బలహీనవర్గాడలకు కేటాయించిన భూములు చట్టపరంగా ఇతరులకు బదిలీ చేయరానివాటిగా ఉండగా, ప్రస్తుతం వాటిపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని వాపోయారు. ఎస్‌సి,బీసీ,మైనార్టీ వర్గాల కోసం కేటాయించిన అసైన్డ్ భూములు, అర్బన్ ల్యాండ్ సీలింగ భూములు నియమాలకు విరుద్ధంగా ఆ క్రమించబడుతున్నాయని వారు ఆరోపించారు. ఆక్రమణలపై ఖానామెట్ గ్రామ ప్రజలు, సామాజిక కార్యకర్తలు కలిసి ఈ ఆంశాన్ని ప్రజాహితం దృష్ట్యా అధికారుల దృషికి తీసుకువస్తున్నామన్నారు. అమర్‌నాథ్‌రెడ్డి అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి విస్తృత స్థాయిలో అసైన్డ్,యుఎల్‌సీ భూములను అక్రమంగా ఆక్రమిస్తున్నాడని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన భూములు అక్రమణలకు గురైనట్లు చెప్పుకొచ్చారు . విలువైన భూములు కబ్జాకాకుండా కాపాడాలని కోరారు. కొందరు రెవెన్యూ అధికారులు, ముఖ్యంగా రెవెన్యూ ఇన్ స్పెక్టర్ స్థాయిలో ఉన్న వారు ఈ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ ఆర్థిక ప్రయోజనాలను పొందుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపితే తగిన అధారాలు సమర్పించేందుకు సిద్దంగా ఉన్నట్లు ఫిర్యాదు దారులు తెలిపారు.ఈ ఆంశంపై ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని వారు తెలిపారు. సాదారణ ప్రజలకు మాత్రం నోటీసులు జారీ చేస్తూ, ప్రభావశీలులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వివక్షాత్మకంగా ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఖానామెట్ గ్రామంలో అసైన్డ్,యుఎల్‌సీ భూములు ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాద్యులపై చర్యపరమైన చర్యలు తీసుకోవాలని, అసలు లబ్ధిదారులకు భూములు తిరిగి అప్పగించాలని ఫిర్యాదుదారులు ప్రభుత్వాన్ని కోరారు.

## నేత్రపర్వంగా హనుమాన్ జయంతి



**నాంపల్లి, మే 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. వైశాఖ బహుళ దశమి, పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ హనుమజ్జయంతిని పురస్కరించుకుని తెల్లవారుఝామున ఉదయం 5గంటలకు ఆలయంలోని శ్రీ భక్త ఆంజనేయస్వామి వారి ఆలయ అర్చకస్వాములు పంచామృత, సింధూరాభిషేకాలు, దివ్యాలంకరణ, తదుపరి తమలపాకులతో విశేష సహస్రనామ, అష్టోత్తర శతనామార్చనలు 7గంటల వరకు, ఆంజనేయస్వామికి ఆకుపూజలు మధ్యాహ్నం 12గంటల వరకు నిర్విరామంగా జరిపించారు. అనంతరం ఉదయం 9గంటల నుండి 11.30 గంటల వరకు పెద్దయెత్తున వేదమంత్రోచ్చారణల, అశేష భక్తజన సందోహం తరలిరాగా శ్రీ మన్యుసూక్త హోమం అత్యంత అద్భుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరిగా పూజలు నిర్వహించిన, విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాల వితరణ కావించారు. శ్రీ హనుమజ్జయంతి సందర్బంగా రాత్రి వరకు అధికసంఖ్యలో ఆంజనేయస్వామి భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయులయ్యారు.

## ఓట్ల తొలగింపుపై దుష్ప్రచారం వద్దు : మర్రి శశిధరరెడ్డి



బీకే గూడాలో డిప్యూటీ కమిషనర్ సుజాతతో మాట్లాడుతున్న మర్రి.

**బేగంపేట మే 13,ప్రభాతవార్త**
ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఏ ఒక్క కులానికో,మతానికో అపాదించి చూడవద్దని బీజేపీ సీనియర్ నాయకులు మర్రిశశిధర్‌రెడ్డి కోరారు.బుధవారం సాయంత్రం బల్కంపేట బీకే గూడాలోని మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్ సుజాతతో ఆయన భేటీ అయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓట్ల సవరణ,భోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు.అనంతరం మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్ల తొలగింపు అనేది కేవలం ఎన్నికల పారదర్శకత కోసమే తప్ప, రాజకీయ ప్రయోజనాల కోసం కాదని,స్పష్టం చేశారు.గతంలో బెంగాల్ లో తొలగించిన 90లక్షల భోగస్ ఓట్లలో ముస్లీం వర్గానికి చెందినవి కేవలం 30లక్షలు మాత్రమేనని,మిగిలిన 60లక్షల ఓట్లు ఇతర వర్గాలవేనని ఆయన ఉదాహరించారు. దీన్ని బట్టి చూస్తే అధికారులు నిష్పక్షిపాతంగా వ్యవహరిస్తారని అర్ధమవుతుందని,అనవసరంగా ఈ ప్రక్రియను భూతద్దంలో చూసి గందరగోళం సృష్టించవద్దని హితవు పలికారు. కేవలం అర్హులైన వారికి ఓటు హక్కు కలిగి ఉండాలన్నదే తమ ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి పురురవారెడ్డి,దయానంద్,ఆకుల మహేష్,క్రాంతికుమార్,నరేందర్,గుంటి సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : జంపన



ఆలయంలో పూజలు చేస్తున్న జంపననప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,మే 13 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 1వ వార్డు జయ నగర్‌లోని శ్రీ శివ సాయిరాం దేవస్థానం 21వ వార్షిక బ్రహ్మోత్స వ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాయిబాబా, డాక్టర్ భాస్కర్ బాబు, శర్మ పాల్గొన్నారు.

## ఘర్షణవద్దన్నందుకు బీరుసీసాతో దాడి

**జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః**
గొడవ చేయకుండా వెళ్లమని చెప్పినందుకు బీరు సీసాతో దాడికి పాల్పడిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండలోని సోని కాకతీయ వైన్స్ ముందు ముదావత్ కమలానాయక్ వాటర్ ప్యాకెట్లు విక్రయిస్తుంటాడు. బోరబండ ఎన్ఆర్ఆర్‌పురంకు చెందిన పరేలా ప్రకాశ్ అలియాస్ బలాల మద్యం మత్తులో అక్కడికి వచ్చి న్యూసెన్స్‌కు పాల్పడటమే కాకుండా అక్కడున్నవారితో గొడవకు దిగాడు. దీంతో అతన్ని అక్కడి నుంచి గొడవ చేయకుండా వెళ్లమని కమలానాయక్ చెప్పడంతో కోపగించుకున్న బలాల బీరు సీసాతో అతని తలపై దాడికి పాల్పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః**
పెళ్లి పేరుతో మోసానికి పాల్పడిన సంఘటనలో బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఒక వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన పేరవాలి నరేష్‌కు 2020లో యూసుఫ్‌గూడలో ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో అతని మాటలు నమ్మిన యువతి అతనితో సంబంధం కొనసాగించింది. ఈ క్రమంలో యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లో అద్దె గదుల్లో పెళ్లి పేరుతో పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. 2024 ఏప్రిల్‌లో యువతి గర్భవతి కాగా బొప్పాయి తినిపించి గర్భస్రావం జరిగేలా చేశాడు. అనంతరం ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో నరేష్ ఆమెను వదిలేసి ప్రవళిక అనే మరో మహిళతో సూరారంలో కలిసి నివసిస్తున్నాడు. ఈ విషయం తెలిసి అక్కడికి వెళ్లిన బాధిత యువతిపై అతను దాడి చేశాడు. బాధితురాలు తొలుత జగద్గిరిగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి జీరో ఎఫ్ఐఆర్ కింద మధురానగర్ ఠాణాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బాలలపై అశ్లీల వీడియోలు ఆన్‌లైన్‌లో ప్రసారంపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః**
జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలలపై లైంగిక దాడులకు సంబంధించిన అశ్లీల కంటెంట్ ఆన్‌లైన్‌లో ప్రసారం చేసిన ఆరోపణలపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఎన్‌సిఆర్‌బి ద్వారా పంపిన ఎన్‌సిఎంఈసి సైబర్ టిప్‌లైన్ నివేదికను ప్రాథమికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక అనుమానాస్పద ఇన్‌స్టాగ్రామ్ ఖాతా మొబైల్ నంబర్‌తో లింక్ అయి ఉన్నట్లు గుర్తించారు. ఆ ఖాతా యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌కు చెందిన ఒక మహిళ పేరుతో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. బాలలపై లైంగిక దాడులకు సంబంధించిన అశ్లీల కంటెంట్ సృష్టి, ప్రసారం లేదా షేరింగ్‌లో ఎవరి పాత్ర ఉందో సమగ్ర దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని అధికారులు తెలిపారు. సున్నితమైన అంశం కావడంతో పోలీసులు గోప్యంగా విచారణ కొనసాగిస్తున్నారు.

## అమాయకులను మోసం చేస్తున్న నకిలీ వైద్యుడి అరెస్ట్

**బేగంపేట మే 13,ప్రభాతవార్త :** మెడలో స్టెతస్కోప్,చేతిలో ఇంజక్షన్ ,ప్రిస్కిప్షన్ ఇలా అచ్చం డాక్టర్ లా వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నకిలీ వైద్యుడిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.రసూల్ పురా ఇందిరమ్మ నగర్‌లో నకిలీ డాక్టర్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ మేరకు ఎస్సై శ్రావణ్‌కుమార్ తన పై అధికారుల అనుమతి తీసుకుని ,పవన్‌సాయి క్లినిక్,,పేరుతో నడుపుతున్న క్లినిక్ పై దాడులు నిర్వహించారు.అక్కడ డాక్టర్ గా చెలామణి అవుతూ వైద్యం అందిస్తున్న చేగు సుబ్రమణ్యం(55)ను పోలీసులు విచారించారు.వైద్య వృత్తికి సంబంధించి లైసెన్స్,సరియైన అర్హత పత్రాలను చూపించాలని పోలీసులు నిలదీయడంతో ఎలాంటి పత్రాలు అతను చూయించలేదు.విచారణలో తాను చిన్న క్లినిక్‌ను ప్రారంభించి పేద ప్రజలను ఆకర్షించి వైద్యం చేస్తున్నట్లుగా ఒప్పుకున్నాడు.దీంతో సుబ్రమణ్యం ను అరెస్ట్ చేసి ఆయన వద్ద నుంచి భారీగా ట్యాబ్లెట్లు,ఇంజక్షన్లతో పాటు వైద్యానికి ఉపయోగించే పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్-2026



పరీక్షాకేంద్రాన్ని తనిఖీచేస్తున్న అధికారిణి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులలో ప్రవేశాలకోసం బుధవారం నిర్వహించనున్న పాలిసెట్ 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకిదేవి తెలిపారు. 13వ తేదీ బుధవారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణం, జోగిపేటలో ఏర్పాటు చేసిన మొత్తం 6 పరీక్షాకేంద్రాలలో 2,068మంది విద్యార్థులు హాజరవ్వాల్సింది ఉండగా, 1897మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 171 మంది ఆబ్సెంట్ అయ్యారని అన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

**న్యాల్‌కల్, మే 13, ప్రభాతవార్త:** మండలపరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్‌నాయకులు ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్‌ప్రభుత్వం మంజూరుచేస్తోందని కాంగ్రెస్‌నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, మహ్మద్ తన్వీర్, కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో విద్యావారోత్సవాల్లో అవగాహన సదస్సు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్

**నర్సాపూర్, మే 13, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా నిర్వహించేందుకు ప్రజా ప్రతినిధులు భాగస్వాములై పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని మెదక్‌జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలలో భాగంగా, నర్సాపూర్ నియోజకవర్గ స్థాయిలోని 9మండలాల సర్పంచులు, మున్సిపల్ వార్డు కౌన్సిల్ సభ్యుల విద్యా అవగాహన సదస్సును బివిఆర్ఐటికళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి హాజరుకాగా, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజుయాదవ్, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రజిని, డిఆర్ఓ అంబదాస్, సమగ్ర శిక్ష ప్లానింగ్ కో ఆర్డినేటర్ జ్యోతి, సిఎంఓ రాజు, ఎంఈఓ తారాసింగ్‌లు పాల్గొన్నారు. వీరి తోపాటు 8మండలాల మండల విద్యాధికారులు, మండలాల రిసోర్స్‌పర్సన్ లు, సర్పంచులు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే నివాళి

**సదాశివపేట, మే 13, ప్రభాతవార్త:** గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన కోనాపూర్ గ్రామ మాజీసర్పంచ్ వసంతాశివనాగప్పపాటిల్ మరణవార్త తెలుసుకున్న సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ వారిస్వగ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, సీనియర్ నాయకులు మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి నర్సింహులు, మాజీసర్పంచ్ సంగమేశ్వర్, నాయకులు శ్రీనివాస్, శేఖర్, మనోహర్, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కొన్యాలలో చలివేంద్రం ప్రారంభం

**హత్నూర, మే 13, ప్రభాతవార్త:** హత్నూర మండలం కొన్యాల గ్రామంలో బుధవారం చలివేంద్రం కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సుజాతసత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు మాజీ ఎంపిటిసి బి.విఠల్‌రెడ్డి, మాజీసర్పంచ్ జుట్టు నర్సింలు, వార్డ్ సభ్యులు, ముదిరాజ్‌సంఘం అధ్యక్షులు పందుగ నారాయణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

**-ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడివయ్య**



కూలీలతో మాట్లాడుతున్న ఎం.ఆడివయ్య, నాగరాజులు

**నర్సాపూర్, మే 13, ప్రభాతవార్త:** ఉపాధిహామీ పనులుచేసే కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆడివయ్య అన్నారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నర్సాపూర్ మండలపరిధిలోని రెడ్డిపల్లి, పెద్దచింతకుంట, చిన్నచింతకుంట గ్రామాలలో పర్యటించి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చిన్న చింతకుంట, పెద్దచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల ఉపాధిహామీ కూలీలు శివయ్య, అమృత, కిష్టమ్మ, బాలయ్య, పోచయ్య, రాజు, నగేష్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సొంత వాహనాలలో ధాన్యం తరలించిన రైతులు



కొనుగోలు కేంద్రం నుంచి ట్రాక్టర్లలో ధాన్యం తరలిస్తున్న రైతులు

**హత్నూర, మే 13, ప్రభాతవార్త:** వరి కొనుగోలు కేంద్రాల వద్ద తూకం చేసిన ధాన్యాన్ని తరలించడానికి సమయానికి లారీలు అందుబాటులో లేకపోవడంతో రైతులే రవాణా సౌకర్యాన్ని ఏర్పాటుచేసుకుంటున్నారు. హత్నూరమండలం నవాబుపేట గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద తూకం చేసిన ధాన్యం తరలించడానికి లారీలు రాకపోవడంతో బుధవారం రైతులే తమ ట్రాక్టర్లలో ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించారు. లారీల గురించి ఎదురుచూసినా లాభం లేకపోవడంతో ట్రాక్టర్లలో ధాన్యాన్ని తరలించడానికి నిర్ణయించుకున్నామని రైతులు తెలిపారు. ఈ విషయమై వెంటనే ఏపిఎం రాజశేఖర్‌ను వివరణ కోరగా, లారీల కొరత ఉన్న మాట వాస్తవమని, ట్రాక్టర్లు తీసుకెళ్తున్న రైతులకు ట్రక్ షీట్లు ఇస్తున్నామని అన్నారు.

# పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో ఈఏడు యాసంగిలో అంచనాలకు మించి 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ హైమావతి, సీపీ రష్మీపెరుమాళ్, రైస్‌మిల్లర్లు, ధాన్యం ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ఇప్పటి వరకు 390 ప్రారంభించుకొని 1 లక్ష 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 54 రైస్‌మిల్లుల్లో వెయ్యి మంది హమాలీల ద్వారా ధాన్యం దించుకోవడం జరుగుతుందన్నారు. తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రవాణా చేసి మిల్లుల్లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. వాహనాల కొరత రాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. వాహన సమస్యతో ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిలువ ఉండరాదన్నారు. సిఎం ప్రతిరోజు ధాన్యం కొనుగోలుపై పర్యవేక్షిస్తున్నారని జిల్లాలో ప్రతి రోజు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులలో దించుకుంటే పది రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

జిల్లాలో రైతులు సన్న రకం ధాన్యాన్ని పండించడానికి ముందుకురావాలన్నారు. కలెక్టర్ కె.హైమావతి తదితరులు మాట్లాడారు. సమీక్షలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జి.తనూజ, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

**ఇథనాల్ ఫ్యాక్టరీ మూసివేయాలని**

## అఖిలపక్ష పార్టీల నిరసన

**బెజ్జంకి, మే 13, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ఏర్పడుతున్న కాలుష్యసమస్యలపై బుధవారం 'రైతు యుద్ధం-ప్రజా ఆరోగ్యం' పేరుతో ప్రజా నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ, బిజెపి, బిఎస్పీ రాజకీయ పార్టీలు, ఎమ్మార్పీఎస్ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీనుంచి వెలువడుతున్న విషవాయువులు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారాయని. భూమి, పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. రైతుల వ్యవసాయ భూములు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేవారు. తీవ్ర శబ్ద కాలుష్యం కారణంగా గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల భవిష్యత్, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, రైతుల భూములకు రక్షణ కల్పించాలని ఫ్యాక్టరీ మూసి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐక్యంగా నిరసన తెలుపుతూ తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, ఎఐవైఎఫ్, డిఎస్పీ, డిఎస్‌యు, సంఘాల నాయకులు లింగాల సురేష్, వంగల నరేష్, తిప్పారపు శ్రీనివాస్, సంగెం మధు, తిప్పారపు మహేష్, బోనగిరి శివ, దొంతరవేణి శ్రీనివాస్, నర్సింగ్, మాంకాళి సురేష్, సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణ, బోనగిరి లింగం, పర్శరాములు, మధు, శ్రీనివాస్, లింగయ్య, విజయ్, శంకర్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా వారోత్సవాలు

**నర్సాపూర్ మే 13, ప్రభాతవార్త :** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు మూడో రోజును ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.హుస్సేన్ మార్గదర్శకత్వంలో, వైస్ ప్రిన్సిపాల్ సమీరా నజ్నీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, సర్పంచులు మండల విద్యాధికారులు హాజరై విద్యాభివృద్ధికి ప్రభుత్వ విద్య కార్యక్రమాలపై కళాశాల అధ్యాపకులు, నిర్వాహకులతో చర్చలు జరిగాయి. అంతేగాక ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అంతేగాక విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ముఖ్య అతిథులు విద్యార్థులను భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరంవిద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తెలుగు పాటలు నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఆదెప్ప, డా. రమేష్, డా. ఎం.డి. ఖాజా ఆరిఫ్, డా. అనిత, డా. బి. సురేష్ కుమార్, డా. రవికుమార్, శ్రీనివాస్, హేమంత్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

## వడదెబ్బకు వృద్ధుడు మృతి

**అల్లాదుర్గం, మే 13, ప్రభాతవార్త :** భానుడి భగభగలతో మండిపోతున్న ఎండలు ప్రాణాన్ని బలి తీసుకుంటున్నాయి. అల్లాదుర్గం మండల పరిధిలోని బహిరన్ దిబ్బ గ్రామానికి చెందిన దిడిగా చెన్ బసప్ప(69) వడదెబ్బకు బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లి వచ్చిన అతడు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా కొద్దిసేపటికి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఎండ తీవ్రత తట్టుకోలేక నోరు ఆరిపోవడంతో వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. చన్ బసప్ప మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. మండలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

## పంట మార్పిడితోనే అధిక నికరాదాయం!

**అన్నదాతలకు శాస్త్రవేత్తలు సూచన**

**కొందుర్గు, మే 13, ప్రభాతవార్త:** వ్యవసాయ పొలాల్లో పంట మార్పిడితోనే అధిక నికరదాయం పొందవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారంనాడు మండలపరిధిలోని ముట్పూర్ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ మల్లయ్యలు రైతులతో నేరుగా మాట్లాడి అధిక దిగుబడి కోసం చేపట్టవలసిన సూచనలను, సలహాలను, వ్యవసాయ నూతన పద్ధతులను వివరించారు. పంటల సాగులో రసాయనిక పురుగు మందులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే అధిక దిగుబడి వస్తుందని, అలాగే సేంద్రియ ధాన్యానికి మార్కెట్లో అధిక ధర వస్తుందని తెలిపారు. పచ్చరొట్టె పైర్లు జీవన ఎరువులను వినియోగించుకుని తద్వారా చీడపీడల ఉధృతి తగ్గించుకోవడానికి అవకాశం ఉందన్నారు. దాంతో వాతావరణ కాలుష్యం నివారించగలమన్నారు. వరి పంట సన్నగింజ రకాలైన తెలంగాణ సోనా కేఎన్ఎమ్ 16 38, డబ్ల్యూ జి ఎల్ 962 సాగు చేస్తే చీడ పీడలను తట్టుకుంటాయన్నారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ సరిత, వార్డు సభ్యులు, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మీ శ్రీకాంత్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## కొండాపూర్ కలాన్‌లో చలివేంద్రం ప్రారంభం

**ధారూర్, మే 13, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని కొండాపూర్ కలాన్ గ్రామంలో వేసవితాపాన్ని తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ మాధవి బుధవారం ప్రారంభించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా బాటసారులకు, స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బిజెపి కోఆర్డినేటర్ వడ్లనందు ముఖ్యఅతిథిగా పాల్గొని, సర్పంచ్ కలిసి ప్రజలకు తాగునీటిని పంపిణీ చేశారు. గ్రామంలో ఇలాంటి సేవాకార్యక్రమాలు చేపట్ట డం అభినందనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

**ధారూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం**

**ధారూర్, మే 13, ప్రభాత వార్త:** పేద ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని, ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. బుధవారం ధారూర్ మండల కేంద్రంతో పాటు మున్నూరు సోమారం, గడ్డమీది గంగారం, మోమిన్ కలాన్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ గృహ ప్రవేశ కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, డీసీసీ వికారాబాద్ జనరల్ కార్యదర్శి బాబా ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు మాన్ సింగ్, మాజీ జెడ్పీటీసీ కుక్కింద రాములన్నలు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తామని నాయకులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిరణ్ కుమార్, రాము యాదవ్ తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సునీతారెడ్డి వ్యాఖ్యలు అనుచితం

**-సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణాగౌడ్**



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్

**కౌడిపల్లి, మే 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పాలనపై అనుచిత వ్యాఖ్యలు చేసి తన ఉనికిని కాపాడుకొవడానికే నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్ ఎద్దేవాచేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం మండలకేంద్రమైన కౌడిపల్లిలోని 765డి జాతీయ రహదారిపై ప్రభుత్వం వరి కొనుగోలుకేంద్రాల ద్వారా రైతులు తరలించిన ధాన్యాన్ని కొనుగోలుచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ రైతులతో నిర్వహించిన రోడ్డుపై ధర్నా, రాస్తారోకోలో కాంగ్రెస్ పాలనపై తప్పుడు ఆరోపణలుచేయడం అనుచితమని ఆయన అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో కొనుగోలుకేంద్రాలకు ధాన్యాన్నితరలించినా రవాణా చేయడానికి లారీలు రాకపోతే రోడ్లపై ధర్నాలు చేసిన దాఖలాలు ఎన్నో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్‌ప్రభుత్వం చేస్తున్న సంక్షేమపథకాలకు ప్రజలు ఆకర్షితులై ఎమ్మెల్యే సునీతారెడ్డిని పట్టించుకోకపోవడంతో అసూయతోనే కాంగ్రెస్‌పై ఆవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. బలవంతంగా రైతులను తీసుకొచ్చి రోడ్డుపై ధర్నా, రాస్తారోకో చేయడం ఎమ్మెల్యే సునీతా రెడ్డికే చెల్లుతుందని ఆయన అన్నారు. ధర్నాలో పాల్గొన్న రైతులలో సగానికి పైగా రైతుల ధాన్యం కొనుగోలుకావడంతోపాటు వారిఖాతాలో డబ్బులు పడినట్లు ఆయన తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి జిల్లాకలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమీక్షాసమావేశాలు నిర్వహించి, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలచేయడంతోపాటు లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా లారీల సమస్యలు రాకుండా ప్రత్యేకశ్రద్ధ చూపించుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈయనతోపాటు ఉపసర్పంచ్ శ్వేతమల్లికార్జున గౌడ్, కాంగ్రెస్ జిల్లానాయకులు రాగుల భూమయ్య, రమేష్‌గౌడ్, దర్జీ రమేష్, గౌడసంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో సర్పంచ్‌లదే ప్రధాన పాత్ర : డీఈవో

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో సిద్దిపేట నియోజకవర్గ స్థాయి సర్పంచ్‌ల అవగాహన సదస్సును డీఈవో శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో సర్పంచ్‌లదే ప్రధానపాత్ర అన్నారు. గ్రామాల్లో ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులో సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగునూర్, చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాలకు చెందిన 50 మంది సర్పంచ్‌లు, ఆయా మండలాల ఎంఈవోలు రాజ ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, గౌరీమోహన్, ఎఎంఓ రమేష్ పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**కొమురవెల్లి, మే 13, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామిని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ బుధవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి కోసం స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం అర్చకులు నవీన్‌యాదవ్‌కు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జునస్వామి తమ ఇంటి, కుల దైవం అన్నారు. దేవాలయం సమీపంలో ప్రభుత్వం తరపున ఒక అతిథి గృహం నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## పీర్ల మసీదు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేత

**మర్కుక్, మే 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో నిర్మిస్తున్న పీర్ల మసీదుకు బుధవారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేల నగదును ముస్లిం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు మాట్లాడుతూ ఎర్రవల్లిలో కులాలకు అతీతంగా కలిసి మెలసి ఉంటామని, ఐక్యతకు నిదర్శనంగా ఎర్రవల్లి గ్రామాన్ని నిలుపుతూ ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా పీర్ల మసీదుకు సహకరించిన రెడ్డి సంఘం సభ్యులకు ముస్లిం మైనార్టీ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, మైనార్టీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నక్కవాగు నుంచి ఇసుక రవాణాను అరికట్టాలి

**-సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**కంది, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నక్కవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, భూగర్భ జలాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. నక్కవాగు పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు కోట్లు సంపాదించుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాలను అరికట్టాలని గొల్లపల్లి జయరాజు సూచించారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండి.షరీఫ్**

**గజ్వేల్, మే 13 (ప్రభాతవార్త):** పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండి.షరీఫ్, విఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో తుమ్మ చంద్రం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుర్రె అంతిరెడ్డి, కె.రామరాజు, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, పెర్క నాగరాజు, మామిడి సురేష్‌గౌడ్, కె.మహేందర్‌రెడ్డి, గుండు మల్లేశం, కుర్రె కరుణాకర్‌రెడ్డి, ఎర్ర రాజేష్, డాకని సాయి, డ్రైవర్ రాములు, జమాల్‌పూర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలో మానసికోల్లాసానికి దోహదం : సిఐ

**గజ్వేల్, మే 13 (ప్రభాతవార్త):** క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తాయని సిఐ రవికుమార్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని ఐఓసి మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంరతం సిఐ రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, భవిష్యత్తులో మంచి క్రికెట్ క్రీడాకారులను తయారుచేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే యువత డ్రగ్స్, బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. నిర్వాహకులు గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి బాకి స్వామిలు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో ఆసక్తిగల యువ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.




మాట్లాడుతున్న సిఐ రవికుమార్

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**మిరుదొడ్డి, మే 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పొగాకు స్వామి(40) మూడేళ్ల నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చికిత్సకోసం వ్యవసాయ నిమిత్తం బోర్లు వేసి భూమి అమ్మి అప్పులు కట్టిన అప్పులు తీరకపోవడంతో ఈనెల 7న వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ఒడిగట్టారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్వామిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## నర్సాపూర్‌లో యువకుడు అదృశ్యం

**నర్సాపూర్, మే 13, ప్రభాతవార్త:** పట్టణంలో ఒక యువకుడు అదృశ్యమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డి కథనం ప్రకారం... పట్టణంలోని శివాలయం వీధిలో నివాసం ఉంటున్న గూని నాగభూషణంకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు భానుప్రసాద్(18) ఒక బియ్యం దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన షాప్‌కు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదని తెలిపారు. అయితే తండ్రి కుమారుడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వస్తుందని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు తండ్రితో పాటు కుటుంబ సభ్యులు భానుప్రసాద్ ఆచూకీ కోసం అన్నిచోట్లా వెదినికా ఆచూకీ లభించలేదు. భాను ప్రసాద్ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు వైట్ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి చామన చాయ రంగు కలిగి ఉంటాడని తెలిపారు. తండ్రి నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు.

### వర్గల్‌లో మరో యువకుడు...

**వర్గల్, మే 13 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన శావుకు శివ కుమార్(20) ఈనెల 12వ తేదీ మంగళవారం ఉదయం 11.30 గంటలకు పొలానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళాడు. రాత్రి అయినా తిరిగి రాకపోయేసరికి అతని తండ్రి నర్సింలు, కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో, తెలిసినవారి దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ పోచాగౌడ్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భూమిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్


భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్

**నారాయణఖేడ్, మే 13, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 6వవార్డులో రిజ్వానాకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి భూమిపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ భూమిపూజ చేశారు. గృహనిర్మాణం విజయవంతంగా పూర్తవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ అధ్యక్షులు తాహిర్ అలీ, బిసి సెల్ అధ్యక్షులు సాయిల పటేల్, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, మహేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

**-నిరుపేదలందరికీ ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం: మల్లేశంగౌడ్**

**కొల్చారం, మే 13, ప్రభాతవార్త:**
కొల్చారం మండలం వరిగుంటం, రాంపూర్ గ్రామాలలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నేడు ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్ధిదారుల ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొల్చారం గ్రామ సర్పంచ్ దేవన్నగారి శేఖర్, చిన్నఘనపూర్ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, రాంపూర్ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్‌రెడ్డి, వరి గుంటం ఎంపిటిసి మాజీ తుడుం రామకృష్ణయ్య, సీనియర్ నాయకులు జోగిపేట విట్టల్‌గౌడ్, చిన్నగంపూర్ పిఎసిఎస్ చైర్మన్ నాగయ్య, కాంగ్రెస్ నాయకులు వడ్ల చంద్రం, ఉపేందర్‌గౌడ్, వార్డ్‌సభ్యులు, రాంపూర్ గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు జంగేటి నాగరాజు, మాజీసర్పంచ్ రామ్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీశైలం, నాయకులు గుండారం రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

**కొల్చారం, మే 13, ప్రభాతవార్త:**
మండలంలో విద్యాప్రమాణాల పెంపు లక్ష్యంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలోభాగంగా 2025-26 విద్యాసంవత్సరానికిగాను అత్యుత్తమ హాజరు కనబరిచిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు రాష్ట్రవిద్యాశాఖ ప్రశంసాపత్రాలను అందజేసింది. మండలం లోని వివిధ పాఠశాలల నుండి ఎంపికైనవారు ఈ ప్రశంసాపత్రాలను ఈ నెల 14వ తేదీన ఆయా పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశం లో అందుకోనున్నారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి ఉమారాణి మాట్లాడుతూ, వచ్చే విద్యాసంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు వందశాతం హాజరు సాధించి మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.

## విద్యాప్రమాణాల పెంపుదలకు చర్యలు


అదనపుగదుల నిర్మాణానికి శంకుస్థాపనచేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**పాపన్నపేట, మే 13, ప్రభాతవార్త:**
విద్యార్థినులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.42 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, డార్మిటరీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో ఉండే బాలికలకు సౌకర్య వంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ పావనిగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్‌గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్, ఉపసర్పంచ్ సద్దాం హుసేన్, నాయకులు కిష్టయ్య, శివయ్య, అంజి, హీరో లాల్, ప్రవీణ్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, నాని, సుఫీ, ఖలీంతోపాటు తహసీల్దార్ సతీష్, పిఆర్ ఎఇ శ్రీకాంత్, పాఠశాల ఎస్ఓ బాలలక్ష్మి, మమత తది తరులు ఉన్నారు.

## గాంధారిపల్లి బీరప్పస్వామి జాతరలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, మే 13, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లా పాపన్నపేట్‌మండలంలోని గాంధారిపల్లిగ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామిజాతరలో మండలనాయకులతోకలిసి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని బీరప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడు తూ, బీరప్పస్వామి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీచైర్మన్ బాలాగౌడ్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకట రామ్‌రెడ్డి, సర్పంచులఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్, మాజీ సర్పంచులు దావుల శ్రీనాథరావు, లింగారెడ్డి, ఏడుకొండలు, స్రవంతిశ్రీనివాస్, గాంధారిపల్లి బిఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షుడు విశ్వాస్‌రెడ్డి, బిఆర్‌ఎస్ కార్య కర్తలు, గ్రామపెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## బొడ్మట్‌పల్లి వద్ద గుండువాగు పూడికతీత


కాలువ పనులు ప్రారంభించిన దృశ్యం

**టేక్మాల్, మే 13, ప్రభాతవార్త:**
పోతులబొగుడ నుంచి ప్రారంభమయ్యే గుండువాగు టేక్మాల్ మండలపరిధి లోని బొడ్మట్‌పల్లి మీదుగా పల్వంచ, టేక్మాల్, చెరువులను నింపుకుంటూ కోరంపల్లి వద్ద మంజీరానదిలో కలుస్తుంది. గతేడాది అధిక వర్షాలతో గుండు వాగు ఉధృతితో గ్రామ చౌరస్తా మీదుగా నీరు ప్రవహించడంతో ఇళ్లల్లోకి, వ్యాపార సముదాయాల్లోకి నీరుచేరటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకరప్ప వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనరసింహ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి గ్రామాన్ని సందర్శించారు. ఈ సమస్య పునరావృతం కాకుండా ప్రత్యేకదృష్టి సారించి చర్యలుతీసుకోవాలని కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు గుండువాగు పూడికతీయించే పనులను గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుండువాగు ప్రారంభించారు. ఈమేరకు మంత్రి దామోదర రాజనర్సింహకు గ్రామపార్టీ అధ్యక్షులు శంకరప్ప, సర్పంచ్ అవినాష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మాధవి భూషణం, వార్డుసభ్యులు గోపాల్, శ్రీశైలం, నర్సింలు, రవిశంకర్‌లతోపాటు తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పిహెచ్‌సిని తనిఖీచేసిన డిఎంహెచ్‌వో


వ్యాక్సిన్ నిల్వను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్

**రామాయంపేట, మే 13, ప్రభాతవార్త:**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ రామాయంపేట మండలం ధర్మారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పిహెచ్‌సి)ను బుధవారం సందర్శించి పలువిభాగాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించి, వైద్యసేవల నిర్వహణపై ఆరాతీశారు. అనంతరం మందుల దుకాణం, ఐఆర్‌ఎల్, వ్యాక్సిన్ నిల్వ కేంద్రాలను తనిఖీచేసి, మందులు, వ్యాక్సిన్ల నిల్వ విధానాలను పరిశీలించారు. ఆరోగ్యకేంద్రంలో అందిస్తున్న సేవలపై సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ వైశాలి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం చివరిగింజ వరకు కొనుగోలు చేస్తాం

**-టిజిఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి**


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

**కంది, మే 13, ప్రభాతవార్త:**
రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరిగింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని టిజిఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని కలివేములలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ రఘు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొగులయ్య, మాజీ అధ్యక్షులు మోతిలాల్, సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ పవిత్ర, ఉప సర్పంచ్ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వార్డుసభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

**-సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ**

**కొల్చారం, మే 13, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. రంగంపేట మాజీ సర్పంచ్ అరిగే విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ చిట్కుల సురేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఎరుకల మంజుల, యాదగిరిలతోకలిసి నిర్మాణపనులను ప్రారంభించారు. అనంతరం గ్రామానికిచెందిన బండి పోచయ్యకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు ఉసికె సుధాకర్, వార్డుసభ్యులు నర్సింలు, నాయకులు నీలకంటి ప్రసాద్, మల్లేశం, సిద్ధరాములు, ఫీల్డ్ అసిస్టెంట్ పోచయ్యలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**


జనగణన ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతిమాసింగ్

**పాపన్నపేట, మే 13, ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కొనుగోలు నిర్వాహకులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలపరిధిలోని కుర్తివాడ గ్రామంలోని కొత్తపల్లి రైతు సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని డిఎస్ఓ, డిఎంసిఎస్ఓతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకోవాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన చేయాలని, అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంటరవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డిసిఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న జనగణన 2027 ప్రక్రియను కలెక్టర్ ప్రతిమా సింగ్, తహసీల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. గృహ గణన వివరాల నమోదు ఎలా చేస్తున్నారని ఎన్యూమరేటర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోపాలు లేకుండా గృహ గణన వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో గణన వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. కలెక్టర్‌వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద, స్థానిక సర్పంచ్ శ్రీధర్, తహసీల్దార్ సతీష్, ఐకెపి ఎపిఎమ్ దత్తాత్రేయ, నిర్వాహకులు రైతులు తదితరులు ఉన్నారు.

## విద్యావారోత్సవాల్లో ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, మే 13, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచి, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యావారోత్సవాలు, సర్పంచులు, కౌన్సిలర్ల కార్యశాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసినసమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో, వార్డుల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో సర్పంచులు, కౌన్సిలర్ల పాత్ర అత్యంత కీలకమని నొక్కిచెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, స్థానికకౌన్సిలర్లు, వివిధగ్రామాల సర్పంచులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలుకేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**-మాజీ సర్పంచ్ మల్లేశం**


కొనుగోలుకు సిద్ధంగా ఉన్న జొన్నపంట దృశ్యం

**కొండాపూర్, మే 13, ప్రభాతవార్త:**
కొండాపూర్ మండలపరిధిలోని గ్రామాల్లో రైతులు పండించిన జొన్నపంటను కోసి దాదాపు 25రోజులు గడిచినా, ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం పట్ల గిర్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మల్లేశం ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటను నిల్వ చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేక ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జొన్న కొనుగోలుకేంద్రాలను ప్రారంభించి రైతుల నుండి పంటను వేగంగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. ఆలస్యం కారణంగా రైతులకు నష్టంవాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల శ్రమకు తగినగౌరవం కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ అధికారులను కోరారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు విజయవంతం


శాస్త్రవేత్తలతో రైతుల దృశ్యం

**కొల్చారం, మే 13, ప్రభాతవార్త:**
పైతర, పోతిరెడ్డిపల్లి, నాయిని జలాల్‌పూర్ గ్రామాల్లో ఈరోజు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు ముఖ్యమైన వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ పి.సతీష్, డాక్టర్ త్రివేణి, అకుల బేబీ, డాక్టర్ సైదానాయక్ పాల్గొని రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. అలాగే బి.రాకేష్, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు సూచించారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

**-గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్‌కు వినతి**


వినతిపత్రం అందిస్తున్న సెంట్రింగ్ అసోసియేషన్

**గుమ్మడిదల, మే 13, ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించి, తమకు రక్షణ కల్పించాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కోరారు. ఈమేరకు బుధవారం గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సి.హెచ్.కుమార్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నిర్మాణప్రాంతాల్లో సెంట్రింగ్ సామగ్రి దొంగతనానికి గురవుతోందని, దొంగలను గుర్తించి కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డుకౌన్సిలర్లు రమేష్, కిషన్, మురళి, సంజీవరెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, రాజు, మండల సెంట్రింగ్ యూనియన్ సభ్యులు వీరేశం, రాజు, కృష్ణ, పోచయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ప్రభుత్వం రుణాలు ఇవ్వాలి

**-మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్‌గౌడ్**


నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

**గుమ్మడిదల, మే 13, ప్రభాతవార్త:**
మత్స్యకారులకు చేపల పెంపకం సంక్షేమ పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్‌గౌడ్ కోరారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని గుమ్మడిదల మత్స్యకారుల సహకారసంఘం నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా ముఖ్య అతిథిగా బిఆర్‌ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరై, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మత్స్యకారుల సంక్షేమనిధికేటాయించి రుణాలు ఇచ్చి మత్స్యకారులను ఆదుకోవాలని అన్నారు. సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ వినయ్‌కుమార్, మత్స్యశాఖ సంఘం జిల్లా డైరెక్టర్ ఉప్పరి వెంకటేష్‌ల సమక్షంలో గుమ్మడిదల నూతన మత్స్యశాఖ సహకారసంఘం నియామక పత్రాలను మున్సిపల్‌చైర్మన్ సిహెచ్.కుమార్‌గౌడ్ రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ కత్తుల రమేష్‌ల సమక్షంలో అందజేశారు.

**మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..**
అధ్యక్షులు కుంటి పెంటయ్య, ఉపాధ్యక్షులు జిన్నా శంకర్, సెక్రటరీ జిన్న కనకేష్, డైరెక్టర్స్, ఉషన్న రాజు, కాశబోయిన రాజు, కుంటి భాస్కర్, కోర్పాతి గణేష్, చిరుమని శ్రీనివాస్, జిన్న వెంకటేష్, ముదిరాజ్‌సంఘం, గ్రామపెద్దలు కుంటి మల్లేష్, ఉషన్న లక్ష్మయ్య, ఆంజనేయులు, ప్యాట భాస్కర్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## ఉపాధి పనులతో లబ్ధి..

**-ఉపాధిపనులను ప్రారంభించిన సర్పంచ్ నీలాపాండునాయక్**


ఉపాధిపనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నీలాపాండునాయక్

**చిలిపిచెడ్, మే 13, ప్రభాతవార్త:**
గ్రామాల్లో నిర్వహించే ఉపాధిపనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నీలాపాండునాయక్ అన్నారు. బుధవారం చిలిపిచెడ్ మండలం గన్యతండాలో ఉపాధిపనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరు ఉపాధిపనులకు హాజరవ్వాలన్నారు. ఉపాధి పనిదినాలను వినియోగించుకుంటూ అధిక వేతనాలు పొందాలన్నారు. ప్రస్తుతం తండా శివారులోని చెరువులో మట్టిని పూడిక తీత ద్వారా రైతులు తమపొలాల్లో మట్టివేసుకోవాలని తద్వారా రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీల్యా నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ మాన్‌సింగ్, వార్డుమెంబర్లు, గ్రామస్థులు తది తరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

**-ఎంపి సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపి సురేష్‌శెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, మే 13, ప్రభాతవార్త:**
మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ శక్తి - బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్‌లోని కుట్టుమిషన్ శిక్షణకేంద్రంలో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం, హెల్ప్‌లైన్ నంబర్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మాట్లాడుతూ మహిళా సాధికారత కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలు మహిళల జీవనోపాధికి, అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ కేంద్రాలు మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాగేష్ శెట్కార్ మాట్లాడుతూ మహిళల సాధికారత, బాలికల విద్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపుకోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు సిడిపిఓ సుజాత, మహిళాసాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త పల్లవి, సూపర్వైజర్లు సుజాత, మంజుల, మహిళాసాధికారత కేంద్రం సిబ్బంది, సఖి సిబ్బంది, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## రొయ్యపల్లిలో వరి కొనుగోలుకేంద్రం

**హత్నూర, మే 13, ప్రభాతవార్త:**
హత్నూర మండలం రొయ్యపల్లి గ్రామంలో హత్నూర సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యాసంగి వరి కొనుగోలు సెంటర్ బుధవారం స్థానిక సర్పంచ్ పోచగౌడ్ ప్రారంభించారు. తమ విజ్ఞప్తిని మన్నించి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు అధికారులకు, నాయకులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

# సదాశివపేట అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు

**-నిర్మలారెడ్డి, జగ్గారెడ్డి కృషితో వేగంగా అభివృద్ధి పనులు**


అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 13, ప్రభాతవార్త:**
టిజిఐఐసి చైర్మన్ నిర్మలారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కృషితో సదాశివపేట పట్టణానికి తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి నిధుల వరదలు కురిపిస్తోందని టిజిఐఐసి చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలకల్పనలో ప్రభుత్వం ఎంతఖర్చయినా వెనుకాడకుండా ముందుకుసాగుతోందని పేర్కొన్నారు. పురపాలకశాఖ ఆధ్వర్యంలో టియుఎఫ్ఐడిసి ద్వారా రూ.13కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి నిర్మలారెడ్డి శంకుస్థాపనచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ డిగ్రీ కళాశాల నుంచి సదాశివపేట వరకు మురికి కాలువ నిర్మాణం, సిద్ధాపూర్ నుంచి మోమిన్‌పేట రోడ్డు వరకు మురికి కాలువతో పాటు బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే పట్టణ మురికినీరు చెరువులో కలవకుండా ఉండేందుకు రూ.3కోట్లతో ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు పనులను కూడా ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పనులు మంజూరు చేసినా నిధులు విడుదల చేయడంలో ఆలస్యం జరిగేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పనుల మంజూరుతో పాటు వెంటనే నిధులు విడుదల చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో టెండర్లు ఖరారైనప్పటికీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితి రాకుండా ప్రత్యేక చొరవ తీసుకుని పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని నిర్మలారెడ్డిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శివాజీ, కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, సిడిసి చైర్మన్ రామిరెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు చింత సాయినాథ్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతాగోపాల్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంటిగృహప్రవేశంలో నిర్మలాజగ్గారెడ్డి-**
సదాశివపేట మండలం చందాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన ఎస్.మోనిక-నాగేష్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, సర్పంచ్ పట్లోళ్ల మల్లేశం, హౌసింగ్ ఎఈ రేష్మ, పంచాయతీ సెక్రటరీ, మండలనాయకులు బింబాదర్‌చారి, బాబు, గ్రామ పెద్దలు రాములు, మృత్యుంజయ, అరవింద్, ఖాసిం, యాదయ్య, భాను, వార్డుసభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.